క్లుప్తంగా

అయోడిన్ లోపాలపై కళాజాతా



కోటంకలో కళాజాతా నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: అయోడిన్ లోపాల వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య అన్నారు. సోమవారం మండలంలోని కోటంకలో ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్ మెంట్, న్యూఢిల్లీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఐటీసీ సహకారంతో ఆయోడిన్ లోపాల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై పేస్ కళాజాతా బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. దరగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్థూల, సూక్ష్మ పోషక విలువలు గల ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహమ్మద్, సుదర్శన్ రెడ్డి, పోతులయ్య, రహీన,వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'రెడ్డి సంఘం' స్థలంలో సర్వే చేయాలి



తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

గుంతకల్లు రూరల్: పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘానికి చెందిన స్థలంలో కొంతమేర సమస్యాత్మకంగా మారిన నేపథ్యంలో సర్వే చేయించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి మాట్లాడుతూ సర్వే నెంబర్ 614ఏ3 ఎల్‌పీ నెం 12-1984 ప్లాట్ నెంబర్లు 1,2లో రెడ్డి సంఘానికి సంబంధించిన స్థలం ఉందన్నారు. అక్కడ సర్వే చేపట్టాలని కోరుతూ వారు వినతి పత్రం అందజేశారు.

యాడికి కాలువకు నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు: మండలంలోని కదదరగుట్టపల్లి వద్ద ఉన్న రెగ్యులేటర్ నుంచి యాడికి కాలువకు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సోమవారం నీరు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటకు నీటిని సక్రమంగా వాడుకోవాలని, దుర్వినియోగం చేయొద్దన్నారు. అనంతరం ఆయన పెద్దవడుగూరు గ్రామంలో పర్యటించారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్, బ్యాంకు ఖాతా సరిచూసుకోండి

గుంతకల్లు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో సబ్సిడీ నగదును పొందేందుకు లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతా, ఆధార్‌ను సరిచూసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మితో కలిసి ఆమె మాట్లాడారు. గ్యాస్ సబ్సిడీ నగదు ఖాతాల్లో జమకాలేదంటూ కొంతమంది లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తున్న నేపథ్యంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో సమీక్షించామన్నారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే డిప్యూటీ తహసీల్దార్ (9703907372), వీఆర్వో (9493348646)ను సంప్రదించాలన్నారు.

సజావుగా వేలం



వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా టెంకాయలు, ప్రసాదాల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పల సేకరణ హక్కు కోసం సోమవారం అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, ఈఓ సుబ్రమణ్యం వేలం నిర్వహించారు. టెంకాయల విక్రయ హక్కును పెద్దపప్పూరు మండలం గార్లదిన్నె రాజారెడ్డి రూ.9.10 లక్షలు, తలనీలాల సేకరణ హక్కును వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు జానకి రామక్రిష్ణ రూ.13.10 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే కొబ్బరిచిప్పలు సేకరణ హక్కును అనంతపురం రంగారెడ్డి రూ.లక్ష, లడ్డూ ప్రసాదాల విక్రయం హక్కును అనంతపురం లక్ష్మీనరసమ్మ రూ.5.30 లక్షలకు దక్కించుకున్నారు. బియ్యం, బేడల వేలం రద్దు అయిందని, త్వరలో తిరిగి వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

నిర్లక్ష్యపు నీడలో నిఘా నేత్రం



ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. ఆ నిఘా నేత్రం నుంచి నేరస్తులు, చోరులు తప్పించుకోలేరు. అలాంటి సీసీ కెమెరాల నిర్వహణపై పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- సీసీ కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం
- పెరుగుతున్న నేరాలు, దొంగతనాలు
- పట్టించుకోని పోలీసులు



యాడికిలోని గాంధీ విగ్రహం వద్ద మరమ్మతులకు గురైన సీసీ కెమెరా

యాడికి: కేసుల ఛేదింపు, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచే సీసీ కెమెరాలు మండలంలో పనిచేయడం లేదు. దీంతో నేరాలు పెరిగిపోతున్నాయి. పోలీసుల పర్యవేక్షణ లోపమే ఇందుకు ప్రధాన కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసు శాఖకు చేదోడు వాదోడుగా నిలుస్తుందన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ ప్రజల చేత 2022 నవంబర్ 21న అప్పటి జిల్లా ఎస్పీ పక్కీరప్ప చేతుల మీదుగా మండల వ్యాప్తంగా 97 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక్క మండల కేంద్రంలోనే ఎంపీపీ బొంబాయి ఉమాదేవి , సర్పంచు అనూరాధ, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజల సహాయ సహకారం తో రూ.5 లక్షలతో మండల కేంద్రంలోని అన్ని ప్రధాన వీధుల్లో 36 సీసీ కెమెరాలు బిగించారు. జిల్లాలోనే అంత పెద్దఎత్తున దాతలను ప్రోత్సహించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించిన అప్పటి ఎస్ఐ పి.వెంకటేశ్వర్లను జిల్లా ఎస్పీ అభినందించారు. దాతల సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రస్తుతం 50కి పైగా పని చేయలేదు.

గతంలో ఊరూరా సీసీ కెమెరాలు

యాడికి మండలంలోని 36 గ్రామాల్లో రెండేళ్ల క్రితం పోలీసుల ప్రోత్సాహం, దాతల సహకారంతో 97 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని యాడికి పోలీస్టేషన్‌కు అనుసంధానించారు. సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకునే వారు లేక ప్రస్తుతం పని చేయడం లేదు. పలు గ్రామాల్లో కోతులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి వైర్లను కట్ చేశాయని, కొన్ని గ్రామాల్లో అక్రమ వ్యాపారాలు చేసే వారు వాటిని పనిచేయకుండా చేశారనే విమర్శలున్నాయి. అధికారులు సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతులు చేయించాల్సి ఉండగా గత ఏడాది నుంచి వాటి గురించి పట్టించుకోకపోవడంతో సీసీ కెమెరాల పరికరాలు ఆనవాళ్లు లేకుండా పోయాయని ప్రజలు వాపోయారు. మండల కేంద్రంలో కోనరోడ్డులో ఉన్నత పాఠశాల వద్ద ఉన్న సీసీ కెమెరా వైరును కోతులు పీకెయ్యడంతో పని చేయలేదు. మండలంలోని చందన రోడ్ కూడలి, నగరూరు రహదారి, పాత పోలీస్టేషన్ క్రాస్ వద్ద , వేములపాడు గ్రామంలో కేజీబీవీ పాఠశాల, మోడల్ స్కూల్ వద్ద ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. కెమెరాలు పనిచేయకపోవడంతో రాత్రి పూట బాలికలు హాస్టల్లో ఉండేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని, లేదా కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం



మండలంలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయించాం. వ్యాపారులు, ఆర్థిక స్థోమత ఉన్న వారు గృహాల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే రక్షణగా ఉంటాయి. నిర్వహణ లోపం లేకుండా ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలను మరమ్మతులు చేయిస్తాం

– ఈరన్న, సీఐ యాడికి



కోనరోడ్డులో నిరుపయోగంగా సీసీ కెమెరా

సీసీ కెమెరాలతో నేరాల అదుపు



రాత్రి సమయల్లో దొంగతనాలు, మహిళల మెడలోని బంగారు నగలల దొంగతనాలు, అత్యాచారాలు, అతి వేగంగా వాహనాలు నడిపి ప్రజలకు నష్టం చేకూర్చడం తదితర సంఘటనలు జరుగుతున్నాయి. ఈ నేరాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయి.

– జూటూరు రఫీ, సీపీఐ మండల కార్యదర్శి, యాడికి

కెమెరాలు చాలా అవసరం



పట్టణంలో ఎక్కడ దొంగతనాలు జరిగినా అసాంఘిక కార్యక్రమాలు జరిగినా సీసీ కెమెరాల్లోని రికార్డు ద్వారా పోలీసులు నేరస్తులను పట్టు కోవడానికి ఎంతో ఉపయోగపడతాయి. సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత పటిష్టంగా నిర్వహించాలి. అవసరమైతే మరికొన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– వెంకటరాముడు యాదవ్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, యాడికి

పోలీసులు ఉన్నట్లే భావించాం



ఊర్లో సీసీ కెమెరాలు ఉంటే పోలీసులు ఉన్నట్లే భావించాం. మద్యం సేవించినా , అసభ్యంగా మాట్లాడినా రికార్డులు అవుతుందన్న భయం. పోలీసులకు చిక్కుతామనే నిందితులు కాస్త మారారు. కాని అవి పని చేయడం లేదని తెలియడంతో గ్రామాల్లో కేబుల్ వైరు దొంగలు, ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు రెచ్చిపోతున్నారు.

– దేవేంద్ర యాదవ్, పుప్పాల గ్రామం, యాడికి

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి



ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్: ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులపై కోట్లాది రూపాయల భారం మోపడం సిగ్గుచేటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్‌ల ఏర్పాటు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ పార్టీ నాయకులు విద్యుత్ నిలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోనని ప్రకటించిన చంద్రబాబు.. ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై సుమారు రూ.15 వేల కోట్ల మేర భారాన్ని మోపి నిలువునా మోసం చేశారన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, సత్తార్, మోహన్, నారాయణ, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నాటుసారా, ఆటో స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

గుంతకల్లు: గుంతకల్లు–మద్దికెర రోడ్డులోని నంచర్ల క్రాస్ వద్ద ఓ ఆటోలో నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంచర్ల క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్దికెర వైపు నుంచి వస్తున్న ఆటోలో నాలుగు సంచుల్లో నాటుసారా ఉన్నట్లు గుర్తించామన్నారు. దాదపు 100 లీటర్ల నాటుసారును సీజ్ చేయడంతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తరలిస్తున్న కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన రామాంజులు నాయక్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచగా, జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశులు, హెడ్ కానిస్టేబుళ్లు గోపాల్‌నాయక్, ధనుంజయ, కానిస్టేబుళ్లు సురేష్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమంగా పాసు పుస్తకాల మంజూరు'

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లిలో వంశపారంపర్యంగా వస్తున్న తమ భూమికి రెవెన్యూ అధికారులు ఇతరులకు అక్రమంగా పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేశారని పారా రామచంద్ర అనే రైతు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మండలంలోని కరిడికొండ పంచాయతీ పరిధిలోని బాచుపల్లిలో సర్వే నంబర్ 158–బీలో 25 సెంట్లు, 159–బీలో 16 సెంట్లు, 160లో 20 సెంట్లు భూమి పారా రామచంద్ర తండ్రి పారా హనుమన్నకు వంశపారంపర్యంగా వచ్చింది. ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెండేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు మంజూరు చేయలేదన్నారు. అయితే తన భూమిని అప్పటి తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్ఐ ఉదయ్, కరిడికొండ వీఆర్‌ఓ లావణ్య అక్రమంగా ధర్మాపురం వీఆర్‌ఓ రాజేష్ తండ్రి మోరం పెద్ద వెంకటేష్, మోరం చిన్న వెంకటేష్ పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు చేశారన్నారు. విచారణ చేసి అక్రమంగా మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాన్ని రద్దు చేసి, తన పేరుపై పాసుపుస్తకం ఇవ్వాలని బాధిత రైతు పారా రామచంద్ర ఫిర్యాదులో కోరాడు.

శబరిమలకు మాలధారుల సైకిల్‌యాత్ర



శబరిమలకు సైకిల్‌పై వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

పామిడి: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి శబరిమలకు మాలధారులు సోమవారం సైకిల్‌యాత్ర చేపట్టారు. గురుస్వామి పెమ్మక స్వామినాథరెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 8 మంది అయ్యప్ప మాలధారులు సైకిల్‌పై బయలుదేరారు. అంతకుముందు మాలధారులకు గురుస్వామి ఇరుముడులు ధరింపజేశారు. పూజల అనంతరం మాలధారులను కుటుంబసభ్యులు, మిత్రులు ఘనంగా సాగనంపారు.

వైభవంగా అనఘాదేవి దత్తాత్రేయ వ్రతం



అనఘాదేవి దత్తాత్రేయ వ్రతం ఆచరిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని దత్త పాదుక క్షేత్రంలో మార్గశిర మాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని సోమవారం అనఘాదేవి దత్తాత్రేయ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ విగ్రహాలను, అనఘాదేవి చిత్రపటాన్ని శోభాయానంగా అలంకరించారు. వేదపండితుడు అమరేంద్రనాథశర్మ ఆధ్వర్యంలో మహిళలు భక్తి ప్రపత్తులతో వ్రతాన్ని ఆచరించారు.

ఉపాధిలో రూ.లక్షల దుర్వినియోగం



ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

బుక్కరాయసముద్రం: ఉపాధి పథకంలో మండల వ్యాప్యతంగా లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయ్యాయని సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలోని 19 పంచాయతీలలో రూ.11 కోట్ల విలువ చేసే పనులు జరిగాయి. తనిఖీ బృందం ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో భాగంగా హౌసింగ్ కాలనీల్లోని ఇంటి బిల్లులలో అవినీతి, రోడ్డుకు అవెన్యూ ప్లాంటేషన్, ఇంకుడు గుంతలు, ఫారంపాండ్ల నిర్మాణాల్లో రూ.లక్ష నిధులు దుర్వినియోగం అయ్యాయని తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. అయితే ఏఏ గ్రామాలలో ఎంతెంత అవినీతి జరిగిందో.. ఎంత ఫైన్ వేశారో వివరాలు తెలియాల్సి ఉంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి, ఏపీడీ సుధాకర్‌రెడ్డి, అనూరాధ, ఎంపీడీఓ సాల్మాన్, ఏపీఓ పోలేరయ్య, ఉపాధి సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ ప్రార్థనలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఐఎన్‌ఈసీ చర్చిలో సోమవారం రాత్రి క్రైస్తవులు క్రిస్మస్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాన్‌డేవిడ్ క్రీస్తు జీవిత చరిత్రను వివరించారు. అనంతరం చర్చి సభ్యులు కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు చేశారు. క్రీస్తు గురించి పాటలను పాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఇమ్మానుయేల్, ఆనంద్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబైన క్రీస్తు మందిరాలు

యల్లనూరు: మండలంలోని యల్లనూరు, నిట్టూరు, పెద్దమల్లేపల్లి, వెన్నపూసపల్లి, శింగవరం, కల్లూరు తదితర గ్రామాల్లో వెలసిన క్రీస్తు మందిరాలను క్రిస్మస్ పండుగ సందర్భంగా ముస్తాబు చేశారు. క్రైస్తవులు మంగళవారం, బుధవారం క్రిస్మస్ పండుగను నిర్వహించనున్నారు.



పెద్దవడుగూరులోని ఐఎన్‌ఈసీ చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శింగనమల: అనంతపురంలోని విశ్వం ఎడ్యుటెక్ సంస్థ జోనల్ మేనేజర్ శివాంజినేయులు, ట్రైనర్ కబీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ జిల్లాస్థాయి పోటీల్లో శింగనమల ఏఎస్‌ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరెస్పాండెంట్ ఆంజనేయరెడ్డి సోమవారం తెలిపారు. స్టార్ సీనియర్స్ విజువైలైజేషన్ విభాగంలో ఐదో తరగతి విద్యార్థి భూమా రవివరణ్, స్టార్ జూనియర్స్ విభాగంలో రెండో తరగతి విద్యార్థిని బెస్త భాగ్యోదయ బహుమతులు సాధించారన్నారు. వారిని ఉపాధ్యాయులు, సిబ్బంది సహ విద్యార్థులు అభినందించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం త్వరలో మార్పు

గుంతకల్లు: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనం కావడంతో త్వరలో వేరే ప్రాంతానికి మార్పు చేయనున్నట్లు సబ్ రిజిస్ట్రార్ షమీర్‌బాషా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న రాజేంద్రనగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం భవనం ఖాళీ చేయాలని యాజమాని విజ్ఞప్తి మేరకు కార్యాలయం మార్పునకు శ్రీకారం చుట్టామన్నారు. విశాలమైన భవనంతోపాటు పార్కింగ్ సౌకర్యం ఉన్న యాజమానులు బాడుగకు ఇచ్చేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలన్నారు.

అన్నదాతల సమస్యలపై గళం విప్పుతాం



రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డిని సత్కరిస్తున్న అనంతవెంకటరామిరెడ్డి

గార్లదిన్నె: జిల్లాలో అన్నదాతల సమస్యల పట్ల వైఎస్సార్‌సీపీ గళం విప్పుతామని ఆ పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నారాయణరెడ్డి సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఇంటికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి నారాయణరెడ్డిని పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించి, రైతు సమస్యలపై ఉద్యమించాలని కోరారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అనుబంధంగా ఉన్న రైతు విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. ఈ నెల 27న పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపిక




పవిత్ర

గుంతకల్లుటౌన్: కేరళలోని క్యాలికట్‌లో ఈ నెల 27 నుంచి 31వ తేదీ నిర్వహించనున్న సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీఎస్సీ విద్యార్థిని బి.పవిత్ర ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మయ్య, ఫిజికల్ డైరెక్టర్ సురేష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పవిత్రను అభినందించారు.

ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని జెండా వీధి సమీపంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో బైక్‌ను ఆటో ఢీ కొంది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న గాంధీనగర్ వాసి బేల్దారి శ్రీరాములు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు.

ఏజీపీగా ఫక్రుబాషా



గుత్తి: గుత్తి జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులకు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) గా ఫక్రుబాషా నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫక్రుబాషా సుమారు రెండు దశాబ్దాలుగా న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రైతు దినోత్సవం



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ అధ్వర్యంలో సోమవారం జాతీయ రైతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి కేక్ కట్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రైతులు సమాజానికి వెన్నముకలాంటి వాళ్లన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రైతులకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ముఖ్యంగా ఉచిత విద్యుత్, రుణమాఫీ చేసి రైతాంగాన్ని ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో పాశం రంగస్వామి, వేణుగోపాల్, సుభాష్‌రెడ్డి, ప్రశాంత్, భరత్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఐదు వినతులు

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి భూంసమస్యలపై ఐదు వినతులు వచ్చినట్లు తహసీల్దారు రాజా తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుప్రజ, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఏపీఓ షబ్బీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.